
# విధి విలాపం

డాక్టర్ కె. రవీంద్రబాబు



వైకుంఠం సాగర్‌లోని గెస్ట్‌హౌస్‌లో బద్ధకంగా పడుకుని వుండగా "సార్" అంటూ లోపలకు వచ్చాడు బోయ్.

'ఏమిటి' అన్నట్టుగా చూసిన వైకుంఠాన్ని ఒకే చూపులో చదివేసి "ఆ సార్ కార్లో ఎక్కుతుండగా ఈ పుస్తకం కిందపడిపోయినట్లుంది" అంటూ ఊదా రంగు ప్లాస్టిక్ కవరు వున్న డైరీ మంచంమీద పెట్టి వెళ్ళాడు బోయ్.

బోయ్ 'పుస్తకం' అంటూ పక్కన పెట్టి వెళ్ళింది ఇరవై సంవత్సరాల నాటి డైరీ. కొసలు చిరిగి మాసిపోయి ఊదారంగు మీద మురికి పాముకుని నల్లడాగులతో వున్న ఆ డైరీని కైలాసం ప్రాణప్రదంగా చూసుకుంటాడు అని తెలుసు వైకుంఠానికి.

"అరే వైకుంఠం - మొట్టమొదటి జీతం డబ్బుల్తో ఈ డైరీ కొన్నారా - అందుకే నేను సంపాదించిన ప్రతి పైసా వివరాలూ ఇందులో రాస్తా! ఈ రోజు వరకూ నాకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు అన్నీ ఇందులోనే వుంటాయి. ఇది నాకు భగవద్గీతకన్నా ముఖ్యమైనది, ప్రాణప్రదమైనది" అని కైలాసం రెండు మూడుసార్లు వైకుంఠంతో చెప్పాడు ఇదివరలో.

ఒకసారి వుండబట్టలేక "నీకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలన్నీ అందులో వుంటాయా?" అని కైలాసాన్ని అడిగాడు వైకుంఠం.

"వుంటాయిరా!" బదులిచ్చాడు కైలాసం.

"ఇప్పుడు నువ్వు కోటికి పడగలెత్తావు. కోట్ల మీద కాంట్రాక్టులు వ్యాపారాలు చేస్తున్నావు! ఆంధ్రప్రదేశ్‌లోని అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలలో నువ్వొకడివి! నీ లావాదేవీలన్నీ ఈ డైరీలోకి ఎక్కించడం ప్రమాదంకాదా? ఒకవేళ దురదృష్టవశాత్తు ఈ డైరీ వ్యాపారంలో నీ పోటీదార్లకు దొరికిందనుకో?! నీ గుట్టుమట్లన్నీ ప్రతికక్షులకు తెలిస్తే నీకు ఇబ్బంది కలుగదా?"

"ఉహూ! ఆ ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తపడుతున్నారా వైకుంఠం. ముఖ్యమైన విషయాలను మాత్రం చిన్న అక్షరాల్తో ఇందులో ఎక్కిస్తున్నా" బదులిచ్చాడు కైలాసం.

* * *

బాయ్ డయిరీ ఇచ్చి వెళ్ళాక వైకుంఠం మనసులో మెదిలిన ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయి. గతించిన విషయాలు గుర్తుకు రాసాగాయి.

వైకుంఠం, కైలాసం సమ వయస్కులు. ఒకే వూరివాళ్ళు. చిన్నప్పట్నించీ ఒకే క్లాసులో చదువుకుని కాలేజీలో చేరారు. వైకుంఠం బికాం చదివాడు, కైలాసం బిఏ చదివాడు.

ఉద్యోగాలవేటలో ఇద్దరూ అవస్థలు పడీ పడీ చివరకు ఇద్దరూ డైమండ్ టుబాకో కంపెనీలో ఉద్యోగాలు సంపాదించారు. వైకుంఠం ఎకౌంటెంట్‌గా, కైలాసం బయ్యర్‌గానూ.

ఉద్యోగంలో చేరేంతవరకూ సన్నిహితంగా మసులుకున్న వైకుంఠం, కైలాసంల దారులు ఆ తర్వాత వేరయ్యాయి. వైకుంఠం ఆఫీసులో కూర్చుని లెక్కలు గుణిస్తూంటే కైలాసం తిరిగిన వూరు తిరుగకుండా పొగాకు పండించే రైతుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ డైమండ్ టుబాకో కంపెనీకి కావలసిన పొగాకు కొంటుండేవాడు.

నెలకోసారి ఇద్దరూ హలో అంటే హలో అనుకునే అవకాశం దొరికేది అదీ కైలాసం జీతం తీసుకోటానికి ఆఫీసుకు వచ్చినప్పుడు.

వైకుంఠం, కైలాసం డైమండ్ టుబాకో కంపెనీలో పనిచేసింది రెండేళ్ళే! పరమపద సోపానపటంలో కైలాసానికి నిచ్చెన దొరికింది, వైకుంఠానికి పాము నోరు ఎదురైంది!


అదృష్టం అందలం ఎక్కిస్తుందన్నట్లు కైలాసం పని మూడు పూవులూ ముప్పైఆరు కాయలుగా మారిపోయింది. వైకుంఠం పని దిక్కుతోచని అగాధం కూపంలో కూరుకుపోవడంగా మారింది.

పద్దెనిమిదేళ్ళ తర్వాత వైకుంఠం కైలాసంల పరిస్థితులు నక్క ఎక్కడ నాగలోకమెక్కడ అన్నట్లుగా మారాయి.

ఇన్నేళ్ళ తర్వాత మారిన పరిస్థితులలో కైలాసం ఇంకా తనను గుర్తుపెట్టుకుని తన కోసం కారు పంపించాడన్న విషయం వైకుంఠానికి ఆనందాన్నీ తృప్తినీ ఇచ్చి అతని మనసును కృతజ్ఞతతో నింపింది!

కైలాసం కారులో దేవేంద్రభవనం లాంటి అతని ఇంటికి వెళ్ళాడు వైకుంఠం.

ఇంట్లో అడుగుపెట్టిన వైకుంఠాన్ని కావలించుకున్నంతగా ఆదరించాడు



**Wanted Distributors & Stockists for each Town.** Write to- **Sujanil Chemo Industries**, 69, Wanowari Ind. Aria, Pune 411 040.

కైలాసం. కుశలప్రశ్నలయ్యాక ''అరేయ్ సరదాగా ఇద్దరం నాగార్జునసాగర్ వెళ్దాం'' అన్నాడు.

తలూపాడు వైకుంఠం.

''నేను పురాతన నాణాలను సేకరించడం హాబీగా పెట్టుకున్నాను! శ్రీముఖ శాతకర్ణి నాణాలు నాకింకా దొరకలేదు. అవి నాగార్జునసాగర్‌లో పనిచేసే ఇంజనీరుగారి దగ్గర వున్నాయని తెలిసింది! ఎలాగైనా ఆయన్ని వొప్పించి ఆయన దగ్గర వున్న శ్రీముఖ శాతకర్ణి నాణాలలో ఒకటైనా సంపాదించాలని నా కోరిక!'' అన్నాడు కైలాసం.

''అలాగేలేరా'' అన్నాడు వైకుంఠం - రా అన్న అక్షరాన్ని నెమ్మదిగా పలుకుతూ.

''మరింకేం - డ్రైవర్ని పంపించి నీ బట్టలు తెప్పించు - ఒక గంటలో బయల్దేరి సాగర్ వెళ్దాం'' అన్నాడు కైలాసం.

''నా బట్టలు ...'' నసిగాడు వైకుంఠం, రెండో జత లేవని చెప్పటానికి నామోషీపడుతూ.

''వాషింగ్‌కు వేసావా? పోన్లేరా దారిలో రెడీమేడ్ షాప్ దగ్గర ఆగి నాలుగు జతల బట్టలు, లుంగీలు, అండర్‌వేర్ కొందాలే - రా కాఫీ తాగు'' అన్నాడు కైలాసం.

వైకుంఠం స్వేచ్ఛగా వూపిరి పీల్చుకున్నాడు. అరగంట తర్వాత రెడీమేడ్ షాప్‌లో వైకుంఠానికి కావలసిన బట్టలు తీసుకుని పాక్ చేయించి రెండు వేల రూపాయల పై చిలుకు బిల్లు కట్టేసాడు కైలాసం.

నాలుగు గంటల కారు ప్రయాణం తర్వాత నాగార్జునసాగర్ గెస్ట్ హవుస్ ముందు దిగారు స్నేహితులిద్దరూ!

స్నానంచేసి దుస్తులు మార్చుకున్నాక బాయ్ తెచ్చిన టిఫిన్ తిని కాఫీ తాగి ఇంజనీరు గారింటికి బయల్దేరి వెళ్ళారు వైకుంఠం, కైలాసం.

ఇనపచువ్వల గేటు వున్న ఇల్లది. కారు దిగగానే ఆ ఇల్లు కనపడుతుంది. ఒక్కసారి వైకుంఠం మనసు చివుక్కుమంది. జీవితంలో పద్దెనిమిది సంవత్సరాలు ఇనుప చువ్వల వెనుక గడిపానన్న విషయం గుర్తొచ్చింది! ఇంజనీరుగారి ఇంటి వరండాకు ఇనుపచువ్వల కటకటాలు వున్నాయి. ఇంట్లోకి అడుగుపెట్టటానికి సంకోచం కలిగింది వైకుంఠానికి, ఎలాగో మనసు

కుదుర్చుకుని స్నేహితుని వెంట అడుగులు వేశాడు.

''దొరగారు లేరు'' అని చెబుతూ ఇంట్లోంచి బయటికి వచ్చాడు బంట్రోతు.

''అలాగా - ఎక్కడికెళ్ళారు?'' కైలాసం.

బంట్రోతు విననట్లుగా వూరకుండిపోయాడు.

కైలాసం చేతిలోని ఇరవై రూపాయల నోటు తన జేబుకి చేరాక బంట్రోతు నోటి తాళం విడిపోయింది.

''దొరగారు కావ్వరెన్సుకని హైద్రాబాద్ వెళ్ళారు. రేపో ఎల్లుండో వస్తారు'' అన్నాడు నమ్రతగా.

''అలాగా-దొరగారు రాగానే నాకు ఫోన్ చెయ్యి. ఇదుగో నా ఫోన్ నంబరు'' అంటూ ఫోన్ నంబరు రాసిన కాగితం, మరో ఇరవై రూపాయల నోటు బంట్రోతు చేతిలో వుంచాడు కైలాసం

రెండు రోజుల తర్వాత ఫోన్ వచ్చింది.

''అరేయ్ వైకుంఠం. ఇంజనీరుగారువచ్చారట. వెళ్ళి ఎలాగైనా ఆయన్ని వొప్పించి నాణెం తీసుకువస్తా. మరచిపోయా - చివాస్ రీగల్ సీసా ఇస్తే ఆయన ప్రసన్నుడవుతాడట.'' అంటూ రెండు చేతుల్లో రెండు చివాస్

రీగల్ పీసాలు పుచ్చుకుని గెస్ట్‌హౌస్ బయట వున్న కారు దగ్గరకు పరుగెత్తాడు కైలాసం.

హడావిడిలో కారెక్కుతూ డైరీ కిందపడేసుకున్నాడు కాబోలు కైలాసం!

బోయ్ డైరీ తెచ్చి యిచ్చిన తర్వాత వైకుంఠం దాన్ని దిండు కింద దాద్దామనుకున్నాడు. కాని కింద పడటంలో అంటుకున్న బురద మురికి చూశాక టవల్‌తో మురికి తుడిచివేస్తుంటే అప్రయత్నంగా డైరీ తెరచుకుని "సెప్టెంబరు 26 — 1971న అయాచితంగా లక్ష రూపాయలు లభించాయి" అన్న అక్షరాలు కనబడ్డాయి!

వైకుంఠం గుండె జల్లుమంది. సెప్టెంబరు 26 — 1971న డైమండ్ టుబాకో కంపెనీలో పనిచేసే వైకుంఠం మీద నిష్కారణంగా, నిర్దాక్షిణ్యంగా లక్ష రూపాయలు కాజేశాడన్న అభియోగం మోపబడింది. కాళ్ళ కింద భూమి కుంగిపోతున్నట్లు గిలగిలలాడాడు వైకుంఠం.

అప్పుడు "నాకేం తెలీదు నేను నిరపరాధిన"ని మొత్తుకున్నాడు తను. కాయితాల్లో కనపడే రుజువును కాదంటే వొప్పుకోటానికి మేమేం వెర్రి వెంగళప్పలం కాదు!" అన్నారు పై అధికారులు.

నిజానికి వైకుంఠం రాసిన లెక్కల్లో పొరపాటు దొర్లిన మాట విజమే! లక్ష రూపాయలు జమాఖర్చుల్లో తేడా వచ్చిన మాటా విజమే! కాని లక్ష రూపాయలు ఏమైపోయిందీ మాత్రం ఎవరూ కనుక్కోలేకపోయారు. ఫలితంగా వైకుంఠం అతనితో పాటు హెడ్ కాషియర్ కటకటాల వెనక్కు వెళ్ళిపోయారు! పోలీసులు కంపెనీ వాళ్ళూ ఎంతగా ఆరా తీసినా పోయిన లక్ష రూపాయలు ఎక్కడ ఎవరు దాచిందీ కనుక్కోలేకపోయారు.

అయిదేళ్ళ తర్వాత వైకుంఠం వున్న జైలులో కొందరు ఖైదీలు తప్పించుకు పారిపోయే ప్రయత్నం చేసినప్పుడు సెంట్రీ వొకడు మరణించాడు. హత్యానేరం మోపబడిన ఖైదీల లిస్టులో పొరపాటున వైకుంఠం పేరు చేర్చబడింది!

అన్యాయంగా మళ్ళీ పధ్నాలుగు సంవత్సరాలు జైలుశిక్ష పడింది! శెలవలు, పండుగలు పోను కటకటాల వెనక్కు వెళ్ళిన పద్దెనిమిది సంవత్సరాలకు బయటకు వచ్చాడు వైకుంఠం.

కైలాసం డైరీలో అయాచితంగా లక్ష రూపాయలు దొరికాయన్న ఎంట్రీ చదివాక వైకుంఠం మనసులో గిలగిల లాడాడు. డైమండ్ టుబాకో కంపెనీలో పోయిన లక్ష రూపాయలూ కైలాసం చేజిక్కించుకున్నాడు! భవిష్యత్తులో సంపాదించే ఐశ్వర్యానికి పునాది రాయిగా అతనికి ఆ డబ్బు ఉపయోగపడింది!

అందుకే గోల్డెన్ టొబాకో కంపెనీ నియోగించిన మనుష్యులూ, పోలీసులు కూడా పోయిన లక్ష రూపాయల అజ కనుక్కోలేకపోయారు!

ఎలా కనుక్కుంటారు?

కైలాసంగాడు డబ్బు కాజేశాడని ఎవరూ ఊహించలేకపోయారు! అప్పుడు వచ్చింది వైకుంఠానికి ఆ సందేహం — 'ఈ కైలాసంగాడు నన్నిక్కడి కెందుకు తీసుకువచ్చినట్లు?'

వైకుంఠం మనసులో ప్రశ్న ముల్లులాగా గుచ్చుకోసాగింది. నిప్పుల కొలిమి మీద నిల్చున్నట్లు అతని శరీరం కాగిపోసాగింది. తల బరువెక్కిపోసాగింది. మిత్రద్రోహం రంపపు కోతయి గుండె రవరవలాడసాగింది.

'అతన్ని అనుమానిస్తున్నాననుకుంటున్నాడేమో — అందుకే ఈ మారుమూల ప్రదేశానికి తీసుకువచ్చి సఫా చేయాలనుకుని వుంటాడు!' అన్న ఆలోచన వచ్చింది వైకుంఠం మనసులో.

'ఉహు! అదేం అయ్యుండదు! ఇన్నేళ్ళు జైలులో వుండిపోయిన నేనంటే కైలాసం భయపడాల్సిన పనేముంది? నేను చచ్చిన పాముతో సమానం! మరేమిటి కారణం?'


ఏం లేదు — అదృష్టం ఎల్లకాలం ఒకరినే వరించి వుండదు. ఇన్నాళ్ళూ అదృష్టం కైలాసాన్ని వరించి అతన్ని అందలం ఎక్కించి నన్ను అథః పాతాళానికి తొక్కేసింది. ఇప్పుడు అదృష్టం నన్ను వరించి నిజం తెలియజెప్పి ఈ పాపి కైలాసాన్ని ఖతం చేసే అవకాశం నాకు కల్పించింది!' అనుకున్నాడు వైకుంఠం.

అంతవరకు మాంద్యంతో నిండిన వైకుంఠం మనసు చురుకెక్కి ఆలోచనలు అద్దం మీద పాదరసంలా పరుగెత్తసాగాయి.

'అవును — కైలాసాన్ని ఉపాయంగా హతమార్చాలి. నా జీవితాన్ని నరకంగా మార్చిన ఆ దుర్మార్గుడిని ప్రాణాలతో వదలగూడదు!'

గెస్ట్ హౌస్ ఆవరణలో బాయ్ "పాము పాము" అని అరవటం వినపడింది వైకుంఠానికి.

బాయ్ కర్రతో పూల మొక్కల మధ్య కొట్టటం కిటికీలోంచి చూసాడతను. రెండు నిమిషాల తర్వాత "మళ్ళీ తప్పించుకుపోయావా?"




అంటూ బాయ్ గేటు వైపుగా వెళ్ళటం గమనించాడు వైకుంఠం.

అప్పుడే గది తలుపు దగ్గర కదలాడినట్లు కనపడింది. చివాలున తల తిప్పి చూశాడు. బారెడు పొడవున్న పాము జరజర పాకుతూ కనపడింది.

వైకుంఠం మనసులో భయంకరమైన ఆలోచన కలిగింది. ఆ క్షణానే అతను ఒక్క ఉదుటున ఎగిరి పాము తలను పిడికిలిలో బంధించాడు. చిన్నప్పుడు పొలం గట్ల మీద తిరిగేప్పుడు ఎదురైన పాములను వొడుపుగా పట్టుకుని పాము చర్మం కొనేవాళ్ళకు అమ్మి పదీపరకా సంపాదించటం గుర్తొచ్చిందతనికి.

'కైలాసంగాడికి పాములంటే మహా భయం! తన జాతకంలో సర్పగండం రాసి వుందని అంటుండేవాడు! వాడు స్నానం చేయకుండా భోంచేయడు! ఇంజనీరు దగ్గర్నుండీ తిరిగి వచ్చాక వాడు తప్పక స్నానం చేస్తాడు!' అనుకుంటూ పామును చేత బుచ్చుకుని స్నానాల గదిలోకి వెళ్ళాడు వైకుంఠం. పామును నేల మీదుంచి పైన స్టీలు బకెట్ బోర్లించాడు.

"కైలాసం స్నానం చేయటానికి బాత్‌రూంలోకి వచ్చి అదాటుగా బకెట్ లిప్పకుని పాముకాటు తిని గిలగిల కొట్టుకు చస్తాడు. దొంగ వెధవ —

నికృష్టంగా చావాలి! నా జీవితాన్ని నాశనం చేసిన కైలాసం దారుణంగా బాధపడి చావాలి!'' కసి దీరా కోరుకున్నాడు వైకుంఠం.

''అరే కైలాసం! నువ్వు నన్ను నిలువునా మోసం చేసినందుకు బదులు తీర్చుకోబోతున్నారా! అంతా నువ్వు పాము కాటు తిని మరణించావను కుంటారు! కాని నేను నిన్ను తెలివిగా హతమార్చానని ఎవ్వరూ తెలుసుకో లేరురా! నీ వంటి నమ్మకద్రోహికి తగిన శాస్తి జరగాలిరా!' పళ్ళు నూరుతూ బాత్ రూం నుండి వచ్చి మంచం మీద పడుకున్నాడు.

అంతే — వైకుంఠానికి కళ్ళ ముందు పొరగమ్మినట్లయి మగత వచ్చింది. విపరీతమైన చలితో వళ్ళు వణికిపోయింది.

*   *   *

మళ్ళీ కళ్ళు తెరిచి చూసేసరికి హాస్పిటల్ మంచం మీద వున్నట్లు అర్థం అయింది. కళ్ళు చిట్లించి చూశాడు వైకుంఠం.

ఎదురుగా ఇంజనీరుగారి బంట్రోతు కనపడ్డాడు.

''ఇంక మీకేం పరవాలేదు! మన సారంతిలో కొస్తే బతుకుతాడని డాట్టరు బాబు సెప్పాడు'' అని బంట్రోతు అనటం వినపడింది వైకుంఠానికి.

బంట్రోతు పక్కన హుందాగా వున్న నడివయసు వ్యక్తి కనపడ్డాడు.

అతను బంట్రోతుతో ''అదృష్టవంతుడు! సెరిబ్రల్ మలేరియా వచ్చి మంచం మీద పడి వుండకపోతే ఇతనూ కైలాసంగారితోపాటు పాము కాటుకి గురై మరణించి వుండేవాడు' అనటం విని వైకుంఠం భయభ్రాంతుడైనాడు. క్షణాలలో మళ్ళీ స్పృహతప్పిందతనికి!

*   *   *

రెండు రోజుల తర్వాత డాక్టర్లు, నర్సులు ఎంతో శ్రమపడ్డాక అతనికి మళ్ళీ స్పృహ వచ్చింది!

కళ్ళు తెరిచిన వైకుంఠానికి ఆ నడివయసు వ్యక్తి కనిపించాడు. చక్కని ఫుల్ సూటులో దర్పంగా వున్నాడు.

''వైకుంఠంగారూ — ఎలా వుంది? నీరసం తగ్గిందా? నేను కైలాసం గారి లాయర్ని'' అన్నాడతను.

ఆశ్చర్యంగా చూస్తున్న వైకుంఠంతో మళ్ళీ అన్నాడు లాయరు ''కైలాసంగారి మరణ వార్త విని గుంటూరు నుంచీ కారు వేసుకువచ్చాను. కైలాసంగారి అంత్యక్రియలు జరిపించాక వెళ్ళిపోదామనుకున్నా — కాని మిమ్మల్ని అపస్మారక స్థితిలో వదలి వెళ్ళలేక ఇక్కడే వుండిపోయా! ... మీరు కోమాలోకి వెళ్ళి ఇవ్వాల్టికి పదోరోజు.''

''అలాగా?'' వైకుంఠం నెమ్మదిగా పలికాడు. లాయరు మంచం పక్కన వున్న కుర్చీ లాక్కుని కూర్చుంటూ, ''వైకుంఠంగారూ! మీ స్నేహితుడు కైలాసంగారు ఎప్పుడూ, 'విధివిలాసం తప్పించుకోలేం లాయరుగారూ' అంటూండేవారు. ఆయనకు కొన్ని మొండి నమ్మకాలుండేవి! మీరూ, ఆయనా చిన్నప్పట్నుంచీ కలసి చదువుకున్నారనీ, ఇద్దరూ ఒకేసారి ఉద్యోగంలో చేరారనీ చెప్పేవాడాయన!

తనకి అదృష్టం కలసివచ్చి లక్ష రూపాయలు చేతికి వచ్చిన రోజే మీ మీద లక్ష రూపాయలు కాజేసారన్న నేరం మోపబడిందట!

'విధి వైపరీత్యం కాకపోతే దాన్నేమనాలి లాయరుగారూ?' అనేవాడాయన.

''లక్ష రూపాయలు తనకు లభించిన రోజే ఆయన మనసులో ఒక సంకల్పం కలిగిందట. అదృష్టం బాగుండి తను ఐశ్వర్యవంతుడయితే మీకు తగు సహాయం చేయాలనుకున్నాడాయన. అందుకే తన ఆస్తిలో నాలుగు లక్షలు మీకు చెందాలని వీలునామాలో రాసాడు! ఎందుకో తెలుసా?'' ఆగాడు లాయరు రెండు క్షణాలు.

''ఆ! తెలుసు!'' అన్నాడు వైకుంఠం నెమ్మదిగా. మనసులో మాత్రం 'మనస్సాక్షితో పోరాడలేక!' అనుకున్నాడు.


'' తనకు లాటరీలో లక్ష రూపాయలు వచ్చిన రోజే బాల్యమిత్రుడి మీద లక్ష రూపాయలు కాజేసాడన్న నేరం మోపబడటం కైలాసంగారి సున్నిత హృదయాన్ని గాయపరచింది! అందుకే ఆయన మీ కెలాగైనా సాయం చేయాలని కోరుకునేవాడు. మీరు జైలులో వుండిపోవడంతో ఆయన కోరిక నెరవేర లేదు. మీరు జైలు నుంచి విడుదల అయి రాగానే మీ కోసం కారు పంపించాడాయన!

వైకుంఠంగారూ! కైలాసంగారు ఎంత సున్నిత హృదయులో మీకు చెప్పక్కర్లేదనుకుంటాను. నిజానికి ఆయన పాము కాటువల్ల మరణించ లేదట! నాగార్జునసాగర్ లో యింతవరకు పాముకాటుతో చనిపోయిన కేసులే లేవట! ప్రాణాపాయం కలిగించే పాము లిక్కడ లేవట!

పాము కరచిందన్న భయంతో షాక్ కి గురై మరణించారు కైలాసంగారు! చూశారా విధి విలాసం!''

లాయరు మాటలు వింటున్న వైకుంఠం హృదయంలోంచి ఎగసిన పశ్చాత్తాప జ్వాల మనసును దహించి, అతనికి మళ్ళీ స్పృహ తప్పింది!

*




ప్రసిద్ధ అమెరికన్ రచయిత మార్క్‌ట్వైన్ హేలీ తోకచుక్క కన్పడ్డప్పుడు (1835) పుట్టి, తిరిగి 1910లో ఆ తోకచుక్క కన్పడినప్పుడే చనిపోయాడు. ఈ విషయం తన ఫ్రెండ్స్‌తో (తన మరణం రోజు) జోస్యంగా చెప్తుండేవాడట! డెబ్భై నాలుగేళ్ళు బతికిన ఆయన చిన్నప్పుడు మహా చిలిపి, అల్లరి, తల్లిని సతాయించేవాడు. ఈత బాగా రాకుండానే అత్రంగా ఈదబోయి 9 సార్లు చావు తప్పించుకున్నాడు. 11వ ఏట తండ్రిని కోల్పోయి ఎన్నో కష్టాలనుభవించి చిన్న చిన్న పనులు చేస్తున్న తనకి 21వ ఏట వీధిలో 50 డాలర్ల నోటు దొరకటం మధుర క్షణం అని వ్రాసుకున్నాడు. తనకు ఇలా డబ్బు దొరికినట్టు పేపరులో ప్రకటించి సొంతదారుని వచ్చి తీసుకోమంటాడు. నాల్గు రోజులు వరుసగా ఇలా పేపరులో ప్రకటించినా ఎవరూ "మాది ఆ డబ్బు" అని రాలేదట. మరీ సత్య హరిశ్చంద్రుల కాలం కదండీ అప్పుడు! తన 23 ఏట ఆ రోజుల్లో అమెరికన్ వైస్ ప్రెసిడెంట్ పొందే జీతాన్ని మార్క్‌ట్వైన్ తన స్వయం కృషి ద్వారా సంపాదించాడట. ఆడవారి ఫ్యాషన్ల గూర్చి హాస్యపూరిత రచనలు చేస్తుండేవాడు.

— అచ్యుతుని రాజశ్రీ